క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ మింది ఫీడర్, 11 కేవీ గాజువాక, 11 కేవీ మింది ఇండస్ట్రీయల్, 11 కేవీ జి.ఏ కాలనీ ఫీడర్, 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ – స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2, ఈఈ బీకే నాయుడు ఆదివారం తెలిపారు. మింది, మింది ఏ – బ్లాక్ ఇండస్ట్రీయల్ ఏరియా, రాంనగర్, గిరిప్రసాద్ కాలనీ, రాంనగర్ బీఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్, మింది రాజీవ్‌నగర్, గుడివాడ అప్పన్నకాలనీ, కాళికా నగర్, మింది వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

బాక్సింగ్ శిక్షణ ప్రారంభం



బాక్సింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నెల్లిముక్కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న మైదానంలో సమ్మర్ బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీ భాయి, పులి వెంకటరమణారెడ్డి, రైల్వే బాక్సింగ్ కోచ్ జీవీ రెడ్డి, బీబీసీ యూబీసీ చీఫ్ కోచ్ కడియాల శ్రీనివాసరావు, కోచ్ చట్టి వెంకటేష్, మురళీధర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో టాపర్లగా నిలిచిన అగనంపూడి, పినమడక హైస్కూల్ విద్యార్థులను స్థానిక ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు. అగనంపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ షబీర్ మొహిద్దీన్ (574), పినమడక హైస్కూల్ టాపర్ అట్టా ఉమా మహేశ్వరి (495)లను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ , సింగిడి సింహాచలం, పిళ్లా రవి, గుదే గజేంద్రరావు, విందుల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న శ్రీ తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని మీ సేవా వద్ద గల వడ్లపూడి ఫిష్‌మార్కెట్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్సులు, నార సంచులను వాడడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, మూర్తి, అప్పలనాయుడు, రాజు, రమణ, వార్డు నాయకులు రామరాజు, దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

చల్ల‘కుండ’



అమ్మకానికి సిద్ధం చేసిన కుండలు



కుండలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వేసవిలో మట్టి కుండలకు డిమాండ్

పెదగంట్యాడ: భానుడు భగ్గుమంటున్నాడు.. మండే ఎండలతో ప్రతాపం చూపిస్తున్నాడు.. వేసవి తాపం కారణంగా ఉపశమనం కోసం చల్లని తాగునీటి కోసం జనం తహతహలాడుతున్నారు. డబ్బున్న వారు రిఫ్రిజిరేటర్లను వినియోగిస్తుంటే.. పేదల మాత్రం మట్టి కుండలనే నమ్ముకుంటున్నారు. పేదవాడి ఫ్రిడ్జ్‌కు ఇప్పుడు డిమాండ్ ఏర్పడింది. అంతేకాకుండా ఆరోగ్య పరంగా చూసుకుంటే మట్టి కుండలే మేలని నిపుణులు చెబుతున్నారు. ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో మార్కెట్లో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. నుడుపూరు కుమ్మరివీధిలో, వంటిల్లు జంక్షన్ వద్ద మెయిన్‌రోడ్డు, గాజువాక మార్కెట్‌లో, పెదగంట్యాడ మార్కెట్లో తదితర ప్రాంతాల్లో మట్టి కుండల అమ్మకాలు జోరందుకున్నాయి. ఎండలు రోజు రోజుకూ పెరగడంతో వేలాది రూపాయలు చెల్లించి రిఫ్రిజిరేటర్లను కొనుగోలు చేయలేని వారు మట్టి కుండ కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. కరెంట్‌తో నడిచే ఫ్రిడ్జిలోని నీళ్ల కంటే మట్టికుండలోని నీళ్లు మంచివని ఆరోగ్య నిపుణులు చెప్పడంతో వీటిని కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు.

రూ.150 నుంచి రూ.300 వరకూ..

ఒక్కో కుండ ధర రూ.150 రూ.300 వరకూ ధర పలుకుతున్నాయి. కూజాలైతే రూ.250 వరకూ ఉన్నాయి. ఒక్కో పరిమాణం ప్రకారం వీటి ధరలను నిర్ణయిస్తున్నారు. ఒక్కో మార్కెట్లో రోజుకు 15 నుంచి 20 వరకూ, కూజాలు 5 నుంచి పది వరకూ అమ్ముడవుతున్నాయని అమ్మకందారులు చెబుతున్నారు.

పెళ్లిళ్లకు ప్రత్యేకంగా..

పెళ్లిళ్లలో వినియోగించే అలివేణి కుండలను ప్రత్యేకంగా రూపుదిద్దుతున్నారు. వాటికి రంగులేసి, డిజైన్లు చేసి రూపుదిద్దుతున్నారు. అయితే వీటిని ఆర్డర్ల మేరకు తయారు చేస్తున్నామని చెబుతున్నారు.

తుమ్మపాల నుంచి మట్టిని తీసుకువచ్చి..

కుండలు, కూజాలు తయారు చేయడానికి ప్రత్యేకంగా వినియోగించే మట్టిని అనకాపల్లి జిల్లాలోని తుమ్మపాల, ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టి ధర రూ.3 వేల నుంచి రూ.4వేల వరకూ ఉంటోందని చెబుతున్నారు.

నెలకు రూ.9 నుంచి రూ.10వేల ఆదాయం

వేసవిలో కుండలు, కూజాలకు డిమాండ్ ఉంటుందని, అయితే వీటి అమ్మకాల ద్వారా ప్రతి నెలా రూ.9వేల నుంచి రూ.10వేల వరకూ ఆదాయం సమకూరుతోందని తయారీదారులు చెబుతున్నారు.

40 ఏళ్లుగా ఇదే వృత్తిలో..



40 ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాను. కుండలు, కూజాలతో పాటు మొక్కలు వేసుకునే కుండీలను తయారు చేస్తున్నాను. ఖర్చులు పెరిగిపోయాయి. ఆదాయం తగ్గిపోయింది. మాలాంటి వారిని ఆదుకునేవారే కరువయ్యారు. మా కష్టానికి తగిన ప్రతిఫలం రావడం లేదు. అయినా వృత్తిని నమ్ముకుని బతుకీడుస్తున్నాం.

–వెంకయ్య, నడుపూరు

ఆరోగ్యానికి మంచిది



మట్టి కుండల్లోని నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిది. మట్టితో తయారు చేసిన కుండల్లో సూక్ష్మ రంధ్రాలు ఉంటాయి. వీటి కారణంగా ఆక్సిజన్ పాసవుతుంది. బ్యాక్టీరియా ఉంటే నశించిపోతుంది. రిఫ్రిజిరేటర్ కంటే మట్టి కుండలే మేలు. పూర్వం కూడా మట్టి పాత్రలు, కుండలనే వినియోగించేవారు. మళ్లీ ప్రజలు మట్టి కుండలకు ప్రాధాన్యం ఇవ్వడం శుభపరిణామం.

–డాక్టర్ అన్నపూర్ణ, వైద్యాధికారి, పెదగంట్యాడ పీహెచ్‌సీ

అల్లూరికి ఘన నివాళులు



ఉక్కునగరంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఉక్కునగరం: ఉక్కునగరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులర్పించారు. ఉక్కునగరం క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సెక్టర్–6 సీతారామరాజు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 99వ అల్లూరి వర్ధంతి కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కేవీ సుబ్బరాజు ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి చేసిన పోరాటం విలువైనదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సతీష్, సాయిరామరాజు, గోపాల కృష్ణంరాజు, బి.ఎస్. రాజు, నాగబాబు, రామచంద్ర రాజు, రవివర్మ, రామరాజు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో...

సీతారామరాజు చిత్రపటానికి సీఐటీయూ కార్యదర్శి డీసీహెచ్. వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె. బాల శౌరి, చిరంజీవి, వి. ప్రసాద్ పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులు

అగనంపూడి: విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. 85వ వార్డు అగనంపూడి సాయినగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కత్తి తిలక్ ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడ గడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజును దేశ ప్రజలు మరువలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.హనుమంతురావు, సత్యనారాయణ, రవి, రమణరాజు, నాగరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

అల్లూరికి బీజేపీ నేతల నివాళి

గాజువాక: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మన్యం వీరుడి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, వెంకట లక్ష్మి, బి.గణపతి, శశిధరణ్ పిళ్లై, గరికిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలను కొనసాగిస్తాం

పెదగంట్యాడ: విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ నాయకులు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఆనంద్, అచ్యుతరావు, దుర్గారావు, సోమేష్, మాధవరావు, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసే నాయకుడ్ని కోల్పోవడం బాధాకరం



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రజాసేవ చేసే నాయకుడ్ని కోల్పోవడం చాలా బాధాకరమని జాతీయ ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ సంతాపసభను ఆదివారం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పక్కి దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ శిష్టకరణాలకు అండగా ఉండే దివాకర్ మృతి తీరని లోటని, ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తుకున్నారు. దివాకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రజలకు కష్టం అంటే వారికి మనోధైర్యం చెప్పి అండగా ఉండే మహోన్నత వ్యక్తి పక్కి దివాకర్ అని అన్నారు. అనంతరం పేద ప్రజలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షులు పీఎస్ వీఎస్ గోపాల్, ప్రతినిధులు ఉర్లం ప్రసాద్, బగ్గం శ్రీనివాస పట్నాయక్, డబ్బీరు గురునాథరావు, బొసంగి తిరుపతిరావు, కంటిమహంతి చంద్రమోహన్, ఎస్.వెంకటలక్ష్మి, ఎం.పీ.సాయికృష్ణ, బలివాడ బుచ్చిబాబు, కృష్ణారావు పట్నాయక్, బీవీ ఎం.కృష్ణ, గాజువాక, అగనంపూడి, ఉక్కునగరం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా మద్దతు పుస్తకాల అందజేత



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ప్రజా మద్దతు పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా భవిష్యత్తు నువ్వే జగనన్న..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసిన విషయం తెలిసిందే. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల మద్దతును కూడగట్టారు. దీనికి సంబంధించిన ప్రజా మద్దతు పుస్తకాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వై నాయుడు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోస్టు కార్డు ఉద్యమం

గాజువాక: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయాలని గాజువాక ఏరియా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ కోరారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని, ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలని, వృద్ధులకు రైల్వేలో రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రతి పెన్షనర్ జయప్రదం చేయాలని కోరారు. ఈ ఉద్యమంలో భాగంగా ఎంపీలను కూడా కలిసి సమస్యలను వివరించనున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఎస్కే హుస్సేన్, కె.దీనబంధు, కె.వి.రమణ, ఎన్.సత్యనారాయణ, డి.వెంకటరావు, యు.వి.పి.రాజు, కె.కిరీటం తదితరులు పాల్గొన్నారు.

10న విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు

గాజువాక: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 10న అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. గాజువాక సబ్ డివిజన్‌లోని బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్‌లో ఉదయం పది గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్టు తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్, నూతన సర్వీసులు, నియంత్రికల ఏర్పాటు, మార్పులు, బిల్లుల సవరణలు, ఇతర సమస్యలపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. గాజువాక, చినగంట్యాడ, మింది సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు.

విశాఖ ఉక్కు కోసం ఉద్యమించాలి



దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 815వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మికులందరు ఏకతాటిగా ఉద్యమించాలన్నారు.

విద్యుత్ సమస్యకు చెక్

- ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు
- విద్యుత్ వెతలు తీరనున్న బహుళ అంతస్తుల ప్రాంతం



ఇండోర్ సబ్‌స్టేషన్‌లో ఉపకరణాలు



అగనంపూడిలోని ఇండోర్ విద్యుత్‌సబ్‌స్టేషన్

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 అగనంపూడిలోని విస్తరించిన కాలనీలు, బహుళ అంతస్తుల భవనాల సముదాయాలకు విద్యుత్ సమస్యకు ఫుల్‌స్టాప్ పడింది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషితో రూ.70లక్షల వ్యయంతో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుకవైపున ఉన్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని ఐదు ఎంవీఏ నుంచి పది ఎంవీఏ రెట్టింపు చేయడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2017లో అగనంపూడి ప్రాంతంలో విస్తరించిన కాలనీలు, బహుళ అంతస్తుల కోసం ఐదు ఎంవీఏ సామర్థ్యం గల ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. గళ్లవానిపాలెం, శనివాడ, పాత అగనంపూడి, శాంతినగర్ కాలనీ, ప్రశాంతినగర్లలో వందలాది బహుళ అంతస్తులు ఏర్పాటు కావడంతోపాటు రోజు రోజుకు ఇళ్ల నిర్మాణం జోరందుకోవడంతో విద్యుత్ వాడకం పదింతలకు పెరిగింది.

దీంతో విద్యుత్ సమస్య మళ్లీ మొదటికి రావడంతో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డిల దృష్టికి ప్రజా సంఘాలు తీసుకువెళ్లడంతో వారు స్పందించారు. తక్షణం సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్ ప్రత్యేక చొరవ తీసుకొని పది ఎంవీఏ సామర్థ్యానికి రెట్టింపు చేయడంతో వేలాది మంది విద్యుత్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ వెతలు తీరాయి..

వడ్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని కెబీఆర్ ఫీడర్ ద్వారా గతంలో విద్యుత్ సరఫరా జరిగేది. ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కొంతమేరకు సమస్య తీరింది. నాలుగేళ్లలో విద్యుత్ వాడకం పెరగడంతో ఇండోర్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచాం. దీంతో సమస్య పరిష్కారమైంది.

–శ్రీనివాసరావు, ఏఈ, వడ్లపూడి, సబ్‌స్టేషన్

నిర్వాసితకాలనీల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం విస్తరించిన కాలనీల్లో సమస్య పరిష్కారం అయింది. అయితే నిర్వాసితుల్లో విద్యుత్ సమస్య యథావిధిగా ఉంది. 26 నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సమస్యను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

–దాసరి త్రినాథ్, డొంకాడ కాలనీ

జాతీయ భావాలతో బీఎంఎస్ అడుగులు



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న బీఎంఎస్ జాతీయ్య అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య

అక్కిరెడ్డిపాలెం: భారత ప్రభుత్వంలో అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గుర్తింపు పొందిందని బీఎంఎస్ జాతీయ్య అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య అన్నారు. 69వ వార్డు షీలానగర్ బీవీకే స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం బీఎంఎస్ ఎల్ 20 జన భాగీధారీ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన బీఎంఎస్ జాతీయ్య అధ్యక్షుడు హరణ్మయ పాండ్య, ఇతర నాయకులు భారతమాత, విశ్వకర్మభగవాన్, బీఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపత్ తెంగడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండ్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో కార్మిక సంఘాలను నడిపించే రెండు ఫెడరేషన్లు డబ్ల్యూఎఫ్‌టీయూ, ఐటీయూసీ పనిచేస్తున్నాయన్నారు. జాతీయ భావాలతో పనిచేస్తున్న బీఎంఎస్ మాత్రం విదేశీ భావజాలాలకు అతీతంగా ఐటీయూసీకు గానీ, డబ్ల్యూఎఫ్‌టీయూకి గానీ అనుబంధంగా కాకుండా స్వతంత్రంగా పని చేస్తోందన్నారు. ఎల్ 20 ప్రారంభం నుంచి ఏ దేశంలో సమావేశాలు జరిగినా ఐటీయూసీ వారే అధ్యక్ష స్థానం వహిస్తున్నారని తెలిపారు. జీ 20 అధ్యక్ష స్థానం భారతదేశానికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం దేశంలో అతి పెద్ద కార్మిక సంఘానికి ఎల్ 20 అధ్యక్ష స్థానం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, ఏపీ బీఎంఎస్ ప్రధానకార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, బీఎంఎస్ ఏపీఎస్ ఆర్టీసీ ఆర్‌హెచ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు వి.వి.కె.రాయ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్.నరేంద్ర, కోశాధికారి ఎల్.ప్రసాద్, భెల్ (హెచ్‌పీవీపీ) నాయకులు చిన్నబాబు, టి.నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ క్లీనింగ్

మద్దిలపాలెం: ప్లాస్టిక్ ఫర్ చేంజ్ పేరిట డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. తీరంలో చెత్త, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. బీచ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సేకరించడంతోపాటు క్లీనింగ్ కార్యక్రమంలో భాగస్వాములైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, రత్నభారతి పాల్గొన్నారు.

సందర్శకులతో హెల్త్ ఎరీనా కళకళ



పార్కులో వాకింగ్ చేస్తున్న యువత



వ్యాయామాలు చేస్తున్న యువకులు

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా సందర్శకులతో కళకళలాడుతోంది. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం నగరవాసులు పెద్ద ఎత్తున పార్కుకు వచ్చి సేద తీరుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఉదయం, సాయంత్ర వేళల్లో పార్కులో సందడి చేస్తున్నారు. 12 సెక్టార్లలో విస్తరించి ఉన్న ఎంవీపీ కాలనీలోనే అనేక కమ్యూనిటీ పార్కులు ఉన్నాయి. స్థానికంగా ఆయా సెక్టార్ల అసోసియేషన్లు ఆయా పార్కులను నిర్వహిస్తున్నాయి. అయితే హెల్త్ ఎరీనాలో సందర్శకులకు అనుగుణంగా సౌకర్యాలు ఉండడం, 3 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్, సహజ సిద్ధమైన జాగింగ్ ట్రాక్ అందుబాటులో ఉండడంతో ఈ పార్కుకు వచ్చే సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారు. ముఖ్యంగా యువతీ యువకులు ఉదయం, సాయంత్ర వేళల్లో పార్కుకు వచ్చి వాకింగ్, జాగింగ్ చేస్తూ సేదతీరుతున్నారు. వ్యాయామశాలను యువత, మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు.

ఘనంగా విశ్వకవి ఠాగూర్ జయంతి



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రుని విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశిష్ట రచనా శైలితో నోబెల్ బహుమతిని సొంతం చేసుకుని ఠాగూర్ భారతీయ సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి మహనీయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సైతం సందర్శించి, ప్రసంగించారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు ఇటువంటి వారి రచనలను సమగ్రంగా చదవడం, అధ్యయనం చేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, లైబ్రరీ టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.